ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
20
బుధవారం 2 ఆగస్టు 2017





వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వాడుముఖం పడుతున్న మొక్కజొన్న పంటను పశుగ్రాసానికి ఉపయోగిస్తున్నాడు చేవేళ్లకు చెందిన రైతు. మనసు చంపుకొని ఎకరంలోని పంటను కోసి తన పశువులకు మేత వేసేందుకు ఉపక్రమించాడు రైతు దండు ప్రసాద్.
- చేవెళ్ల రూరల్

వంట.. మంట



గ్యాస్ ధరకు రెక్కలు రానున్నాయి. వంట గ్యాస్ సిలిండర్‌పై క్రమంగా ధరను పెంచుతూ సబ్సిడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని తొలగించేందుకు సిలిండర్‌పై నెలనెలా రూ.4 పెంచాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని భారం పడనుంది. ఒకేసారి కాకుండా ప్రతి నెలా రూ.4 పెంచుతూ.. రాయితీకి మంగళం పలుకనుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది.
7లో

- వంట గ్యాస్‌కు మంగళం..
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం
- సబ్సిడీ సిలిండర్‌పై ప్రతి నెలా రూ.4కు పెంచుతూ చివరకు స్వస్తి
- సామాన్యులకు వంట గ్యాస్ మంటగా మారుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు

గ్రామాల అభివృద్ధికి.. ప్రతి ఒక్కరూ సహకరించాలి

- నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి
- మహిళలు సాక్షరభారత్ కేంద్రాల్లో చదువుకునేందుకు మక్కువ చూపాలి..
- జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
- రాష్ట్ర విద్య మౌలిక వసతుల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్

20లో



గొలపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ సునీతారెడ్డి

టోల్‌ప్లాజా వద్ద దాడికి పాల్పడిన..

నిందితుల అరెస్ట్

కడ్తాల్ టోల్‌గేట్ సిబ్బందిపై కత్తితో దాడిచేసిన వ్యక్తితో పాటు మరో ఐదుగురికి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిఫ్‌కోర్టు మేజిస్ట్రేట్ 11 రోజుల రిమాండ్‌ను మంగళవారం విధించారు. రూ.30ల టోల్‌ఫీజు చెల్లింపు విషయమై సోమవారం అర్ధరాత్రి టోల్ సిబ్బందిపై అధికార పార్టీ నేత తనయుడు, ఆయన స్నేహితులు దాడి చేసిన సంఘటన జిల్లాలో తీవ్ర సంచలనం రేపింది.


నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచిన పోలీసులు

- నిందితులకు 11 రోజుల రిమాండ్ విధించిన కల్వకుర్తి మున్సిఫ్ కోర్టు
- అధికార పార్టీ నేత కుమారుడు, స్నేహితుల వీరంగం
- రూ.30 టోల్ ఫీజు చెల్లింపుపై ఘర్షణ
- కారు ఆపినందుకు సిబ్బందిపై దాడి
- సూపర్‌వైజర్‌ని వెంటాడి కత్తితో పొడిచిన వైనం
- నిందితులను తప్పించే యత్నం

7లో

రాష్ట్రంలో..

పోలీసు రాజ్యం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

- నేరెళ్ల ఘటన టీఆర్ఎస్ దమనకాండకు సాక్షీభూతం
- నైజాం దొరలనే తరిమికొట్టిన చరిత్ర మనది
- తిరుగుబాటు మళ్లీ ప్రారంభం కావాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

20లో


20
సబితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న తుమ్మలూరు టీడీపీ యువకులు

రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

మాజీ హోంమంత్రి సబితారెడ్డి

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

పోకిరీల ఆట కట్టించేందుకే 'షీటీమ్స్'


- వికారాబాద్ జిల్లాలో మూడు బృందాలు
- క్షణికావేశాలతోనే భార్యభర్తల మధ్య గొడవలు
- కౌన్సెలింగ్‌కే తొలి ప్రాధాన్యం
- రాజీ కుదరకపోతేనే కేసులు
- జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో, జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి నిర్మల



వికారాబాద్ అర్బన్: షీ బృందాలను చాలా పకడ్బందీగా జిల్లాలో నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్‌కు ఒక బృందం వంతున జిల్లాలో మొత్తం మూడు షీ బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కొక్క షీ బృందంలో ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. అందులో ఒక హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉంటారు. వీరు నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ పోకిరి వేషాలు వేసే వాళ్లపై నిఘా ఉంచుతారు. ఎక్కువగా రద్దీ ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్ వంటి ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద వీరు మఫ్టీలో ఉండి పోకిరీల ఆగడాలపై నిఘా పెడతారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండు కేసులు నమోదు చేయడం జరిగింది. అందులో ఒకటి నవాబుపేట మండలం ఎక్‌మామిడిలో కాగా, వికారాబాద్‌లో మరో కేసు నమోదైంది. పదుల సంఖ్యలో షీ బృందాలు పట్టుకొచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతోంది. కౌన్సిలింగ్ ఇచ్చిన తరువాత కూడా ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై ఖచ్చితంగా కేసు నమోదు చేయడం జరుగుతుంది. ఇందుకోసం ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం వికారాబాద్ పట్టణంలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో షీటీమ్ బృందాల పనితీరు, నిర్వహణపై అవగాహన కల్పిస్తూ అర్థమయ్యే విధంగా తెలియజేస్తున్నాం. ఈ విషయంలో జిల్లా ఎస్పీ అన్నపూర్ణ ప్రత్యేక చొరవ తీసుకొని షీటీమ్స్‌ను ముందుకు నడిపిస్తున్నారు. వికారాబాద్ తరువాత జిల్లాలోని అన్ని మండలాల్లో, వసతి గృహాల్లో షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. యువతీ, యువకులకు టీనేజీలో జరిగే అనర్థాలు, ఆ తరువాత ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. తప్పు చేసిన వారు తప్పించుకునే ప్రసక్తి లేదు. ఇందుకోసం పోలీసు యంత్రాంగం తరపున సీసీ కెమేరాలు, షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో వికారాబాద్‌లోనే ఏకైక మహిళా స్టేషన్ ఉంది. దీంతో ఎక్కువ శాతం ఇక్కడకు అత్తమామలు, వరకట్నం వేధింపులు, భర్త వేధింపులకు సంబంధించిన కేసులు ఇక్కడకు వస్తుంటాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తరువాత అక్కడ పరిష్కారం కాని పక్షంలో ఇక్క డకు ఫిర్యాదుదారులు వస్తుంటారు. ఎక్కువ శాతం క్షణికావేశం, భార్య భర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోక పోవడం వల్ల వివాదాలు తలెత్తుతుంటాయి. అలాంటి వారికి ఇక్కడ కౌన్సిలింగ్ ఇస్తాం. రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా తమ తీరు మార్చుకోకుంటే వారు కోరిన విధంగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుంది. ఈ మధ్య జరిగిన లోక్ అదాలత్‌లో వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి 42 కేసులను రాజీ కుదర్చడం జరిగింది. లోక్ అదాలత్ ద్వారా ఒకసారి కేసు కొట్టివేయడం జరుగుతుంది. రాజీ కుదుర్చుకోవడం ద్వారా కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. ఈ విధంగా రాజీ మార్గాన్ని ఎంచుకుని కేసులను పరిష్కరించుకుంటున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు మహిళా పోలీస్ స్టేషన్‌కు 297 ఫిర్యాదులు రాగా అందులో 220 ఫిర్యాదులను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించగా, 37 కేసులు నమోదు చేశాం. వీలైనంత వరకు కేసులను రాజీ కుదిర్చేందుకే ప్రయత్నిస్తుంటాం. వీనని పక్షంలో వారి ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేయడం జరుగుతుంది.

బిందుసేద్యానికి అడ్డుకట్ట

- మరమ్మతు లేక పైపుల్లో పేరుకుపోతున్న కాల్షియం
- నిర్వహణను పట్టించుకోని అధికారులు



చౌదర్‌పల్లిలో డ్రిప్‌తో సాగవుతున్న కూరగాయల తోట

యాచారం: సూక్ష్మ బిందుసేద్యం పరికరాల మరమ్మతుల బాధ్యతను ఆయా కంపెనీలు విస్మరించడంతో రంగారెడ్డి జిల్లాలోని రైతుల అవస్థలు పడుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేయడం అనే నినాదంతో రంగారెడ్డి జిల్లాలో 2003 సంవత్సరంలో (మైక్రోఇరిగేషన్‌ప్రాజెక్టు) సూక్ష్మ సేద్యాన్ని అమల్లోకి తెచ్చారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రైతులకందిస్తున్నారు. ఈ సూక్ష్మ బిందు సేద్యం మెయింటెన్స్ సరిగ్గా లేక రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. చాలా మంది రైతులకు డ్రిప్ మెయింటెన్స్‌ను కంపెనీలు విస్మరించడంతో రైతులే తోటి రైతుల సూచనలతో బాగు చేసుకుంటున్నారు.

పరికరాల సరఫరా ఇలా

రంగారెడ్డి జిల్లాలో రాయితీపై 2003 నుంచి బిందుసేద్యం పథకం ప్రారంభమైంది. ఐదేళ్ల వ్యవధిలో 3వేల హెక్టార్లలో బిందుసేద్యం పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా వాటి ఉపయోగం, వినియోగం మాత్రం చాలా పేలవంగా ఉంది.

ఇలా మారుతున్నాయ్..

బిందుసేద్యం పరికరాలకు సంబందించి నీటిని మొక్కలకు అందించే కీలకమైన పైపుల్లో నీటిలోకలిగి ఉండే కాల్షియం, మెగ్నీషియం, వంటి టీడీఎస్ లవణాలు పేరుకుపోయి గడ్డకడుతున్నాయి. ఫలితంగా పైపుల నుంచి నీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి.

ఏం చేయాలంటే..

పైపుల్లో పేరుకుపోయిన కాల్షియం, మెగ్నీషియం లవణాల గడ్డలు, పైపులు ఫిల్టర్ల నుంచి తొలగించేందుకు కనీసం ఏడాదికి ఒక్కసారైన యాసిడ్ ట్రీట్‌మెంట్ ద్వారా శుభ్రం చేయాలి.

ఎవరు చేయాలి..

యాసిడ్ ఖర్చులు రైతులే భరించినా టెక్నిషియన్ల సేవలను మాత్రం వీటిని అమర్చిన కంపెనీలే రైతులకు ఉచితంగా ఐదేళ్లపాటు అందించాల్సి ఉంది. ఐదేళ్ల నుంచి రైతులకు ఆయా సంస్థలు ఈ సేవలను అందించడం మానేశాయి.

ముందుకు రాని కంపెనీలు

కూరగాయల సాగు, పండ్లతోటల సాగుకు బిందుసేద్యం పరికరాలు అమర్చుతున్నారు. రైతులకు ఆయా కంపెనీల సేవలందక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. పొలంలో బిందుసేద్యం పరికరాలు అమర్చింది మొదలు ఏళ్ల గడిచినా మళ్లీ ఆయా కంపెనీల ప్రతినిధులు తమ వైపు కన్నెతి చూడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఐదేళ్లు ఉచిత సేవలు అందించాలి

బిందుసేద్యం పరికరాలు అమర్చిన తరువాత ఐదేళ్ల పాటు ఆయా కంపెనీలు వీటి నిర్వాహణ విషయంలో ఏసమస్య వచ్చినా ఐదేళ్లు ఉచితంగా సేవలందించాల్సి ఉంది. ఈ విష యంలో ఉద్యానవనశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పడేస్తున్నారు..

చాలా గ్రామాలలో డ్రిప్‌ల మెయింటెన్స్ సరిగ్గా లేక పోవడంతో డ్రిప్ పరికరాలు పాడైపోయి పొలానికి నీరందించడం లేదు. డ్రిప్ పరికరాలు మరమ్మతులకు గురికావడంతో వాటిని రైతులు తొలగిస్తున్నారు. పైప్ నీరు పోయకపోవడంతో మరమ్మతు చేసే విషయం తెలియక రైతులు వాటిని తొలగించి పాడేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

అన్నదాతలకు బిందుసేద్యం పరికరాలను సరఫరా చేసిన కంపెనీలు ప్రతి మూడు నెలలకోమారు యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసి రైతులకు చూపాలి. రైతు కోరిన ప్రకారంగా పైపులను శుద్ధి చేసి చూసి నీరు రాని పరిస్థితుల్లో వాటిని తొలగించి కొత్త పైప్‌లందించాలి. డ్రిప్‌లు బాగున్నాయా లేదా అనేది చూడాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇక్కడే అధికం

యాచారం మండలంలోని గడ్డమల్లాయాగూడ, గున్‌గల్, మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాలలో మాత్రమే కూరగాయలసాగు అధికంగా చేస్తున్నారు. గడ్డమల్లాయాగూడ గ్రామంలో డ్రిప్ పని చేయని కొందరు రైతులు వారే కెమికల్ తెచ్చుకొని బాగు చేసుకున్నారు. ఇక్కడ వెంకటరెడ్డి అనే రైతు స్వత హాగా భారీ గడ్డ ఏర్పాటు చేసి దానిపై నీటి టాంకు కట్టి దాంట్లోకి నీరు పెట్టి డ్రిప్ యంత్రం పెట్టి కూర గాయలు సాగు చేసుకుంటున్నారు.


మేమే బాగు చేసుకుంటున్నం



మేమే డ్రిప్ పైపులను బాగు చేసుకుంటున్నం. సూది లేదా దాని సమానమైన పరికరంతో డ్రిప్ పైప్‌లో ఇరుకున్న వ్యర్థాలను తొలగించి బాగు చేసుకుంటున్నం. డ్రిప్ పైప్ పాడైనట్లు కంపెనీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి డ్రిప్ పరికరాలు కొంటే కంపెనీ అధికారులు బాగు చేయడం లేదు.

- గౌరనర్సింహ, చౌదర్‌పల్లి సర్పంచ్, రైతు

కంపెనీ వాళ్లకు చెప్పినా బాగు చేయరు



డ్రిప్ పాడైనట్లు డ్రిప్ కంపెనీ అధికారులకు తెలిపినా వారు రారు.. చూడరు. ఊర్ల తోటి రైతులనడిగి బాగు చేసుకుంటున్నం. చాలా మటుకు పాడైన డ్రిప్ పైప్‌లు పారేస్తున్నారు. కాలం చెల్లిన వాటి స్థానంలో కొత్తగా పైప్‌లు ఇవ్వాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. గింత అన్యాయం ఎక్కడ లేదు.

- నారాయణ రైతు చౌదర్‌పల్లి

అన్ని విధాల ఆదుకుంటున్నం



ఏయే రైతు ఏకంపెనీ నుంచి డ్రిప్ పైప్‌లు కొన్నారో తెలుసుకొని వాటిని ఆయా కంపెనీల చేత బాగు చేయించడం కోసం చర్యలు తీసుకుంటున్నం. డ్రిప్ పైప్‌లు రైతులే బాగు చేసు కోవడం బాధేస్తుంది. ఇక నుంచి కంపెనీల అధికారులతో డ్రిప్‌ను బాగు చేయించడం కోసం చర్యలు తీసుకుంటాం.

- యాదగిరి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి

భక్తిశ్రద్ధలతో సీత్లా వేడుకలు



సీత్లా ఉత్సవాల ఊరేగింపులో గిరిజన మహిళలు

ఆమనగల్లు : ఆమనగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రాయన్‌పల్లి తండాలో సీత్లా ఉత్సవాలు గిరిజనులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయానికి సీత్లా ఉత్సవాలు అద్దం పట్టాయి. వివిధ ప్రాంతాలలో ఉన్న తండా గిరిజనులు సీత్లా ఉత్సవాలకు చంద్రాయన్‌పల్లి తండాకు చేరుకోవడంతో తండాలో సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవాలలో కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లావంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లు తమ అనుచరులతో వేర్వేరుగా పాల్గొన్నారు. సీత్లా పండుగ నేపథ్యంలో స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద నిర్వహించిన పూజల్లో తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరిజన మహిళలు నూతన వస్త్రాలు ధరించి తండాలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సీత్లా దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో గిరిజన యువతుల, మహిళల నృత్యాలు, లంబాడి డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాయకులు కేశవులు, భన్సీలాల్, కృష్ణానాయక్, సురేశ్ నాయక్, వస్పుల సాయిలు, శ్రీను నాయక్, రామలింగం, వస్పుల శ్రీశైలం, రాఘవేందర్, రవీందర్ పాల్గొన్నారు.



గిరిజన యువతులతో ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు బాలిక అప్పగింత

మాడ్గుల: మండలంలోని ఇర్విన్ గ్రామంలో మైనర్ పెళ్లి పోలీసు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తతో నిలిచిపోయింది. గ్రామానికి చెందిన ఓ బాలికకు (17) బుధవారం వివాహం నిశ్చయమైంది. దీంతో గ్రామస్థులు పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో మంగళవారం గ్రామానికి వెళ్లి వివాహం కుదిరిన బాలికకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం అంగన్ వాడీ సూపర్‌వైజర్ విద్యావతికి అప్పగించినట్లు ఎస్‌ఐ గిరీశ్‌కుమార్ తెలిపారు.

బియ్యం కేసులో ఇద్దరికి రిమాండ్

మాడ్గుల: మాడ్గుల మండంలోని నాగిళ్ల గ్రామ పంచాయితీ పరిధిలోని ఫిరోజ్‌నగర్‌లో ఇటీవల ఎన్‌పోర్స్‌మెంట్ వారు పట్టుకున్న పీడీఎస్ బియ్యం కేసులో ఆమనగల్లు పట్టణానికి చెందిన వ్యాపారస్థుడు సుమన్, ఫిరోజ్‌నగర్ గ్రామానికి చెందిన శంకర్ యాదవ్‌లను మంగళవారం అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గిరీశ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిగి రోడ్డులో మంగళవారం తెల్లవారుజామున 1:30 గంటలకు జరిగిన ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌చారి తెలిపారు. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, భార్య చంద్రకళ, కుమారుడు రోహిత్, అన్న కుమారుడు రవీందర్‌తో కలిసి టవేరా వాహనంలో షాద్‌నగర్ వచ్చి రాత్రి తిరిగి వెళ్తుండగా పరిగి రోడ్డులోని వెంకటేశ్వర వేబ్రిడ్జి సమీపంలో కంటెయినర్ వాహనం టవేరాను ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు తెలిపారు. బాధితుల బంధువు మెరుగు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మరో ఘటనలో..

కొత్తూరు: మండల కేంద్రానికి సమీపంలో గల వినాయక్ స్టీల్ చౌరస్తా వద్ద బైపాస్ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు గాయపడ్డట్లు ఏఎస్‌ఐ శేఖర్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన షాకీర్(27), తమ్ముడు ఇబ్రహీం(23) ఇరువురు కలిసి ద్విచక్ర వాహనంపై ఇన్ముల్‌నర్వ గ్రామ సమీపంలో గల హజరత్ జహంగీర్‌పీర్ దర్గాను దర్శించుకొని తిరుగు ప్రయాణమవుతూ చౌరస్తా దాటుతుండగా షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలివెళ్లారని పేర్కొనారు. షాకీర్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సోషలిస్టు నాయకుడి మృతి


భౌతిక కాయం వద్ద నివాళుల ర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి

ఆమనగల్లు: సోషలిస్టు నాయకుడు, రైతు సంఘం నేత ఎన్.అచ్చిరెడ్డి (84) మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి , బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి సందర్శించి నివాళులర్పించారు. అచ్చిరెడ్డి సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు వెంకటయ్య, కొండల్ రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరసన


పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు

చేవెళ్ల రూరల్ / షాబాద్: ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల, షాబాద్ తదితర మండలల్లోని మోడల్ పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఆనంతరం ఎంఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇస్తున్న రూ. 7500 జీతం సరిపోవడం లేదన్నారు. వెంటనే రూ.15వేలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రుబియ, జ్యోతి, పల్లవి, స్వప్న, సంధ్య, శాంతి, వింద్యారాణీ, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, రమేశ్, స్వేత, వెంకటస్వామి, వెంకటరామ్, యాదయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: ప్రత్యేక రాష్ట్రాన్ని సాదించుకున్నప్పటికి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఊటు మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలతో పాటు, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలంటూ ఆ సంఘం మహేశ్వరం బాగ్ కన్వీనర్ కందడి శ్రీరామ్‌తో కలిసి ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తానని చెప్పి అధికారం చేపట్టాక వాటిని పరిష్కరించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు రూ.4వేల కోట్లు పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు టిఎస్‌పిఎస్ నోటిఫికేషన్ల వాయిదా, అవకతవకలు, ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చి, కార్పొరేట్ కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఏవో ఉషాకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ ఎం.దేవేందర్, నాయకులు పవన్‌కళ్యాణ్, విక్రమ్, రవికిషోర్, వినేష్, అనూష, స్వాతి, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్‌అర్బన్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొంటున్న ప్రభుత్వం కేవలం మాటల్లో మాత్రమేనని చేతల్లో లేదని ఏబీవీపీ నాయకుడు శరత్‌కుమార్ పేర్కొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటును చెల్లించాలని, విద్యా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం అభివృద్ధిని మరిచి అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. విద్యా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తే కేసులు నమోదు చేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో శివానంద్, సురేష్, వేణు, సాయి, అంజి, బుజేందర్, రవిచందర్, ఆంజనేయులు, నవీన్, భరత్, బాలు, మాధవరెడ్డి, గణేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొత్తూర్‌లో....

కొత్తూర్: స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక ఏబీవీపీ నాయకులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాలను అణాచివేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేష్‌చారి, కో-కన్వీనర్ శివకుమార్ చారి, సాయిఅరుణ్ యాదవ్, గణేష్, వినోద్‌చారి, సతీష్, చందు, సందీప్, శ్రీకాంత్ , సుధాకర్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణభయం ఉంది

- అనవసరంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- మహబూబ్‌నగర్ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

నాపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు... మా పార్టీ నేతతో పాటు ఓ వ్యాపారవేత్త నుంచి నాకు ప్రాణహాని ఉంది. ప్రభుత్వమే నాకు రక్షణ కల్పించాలని మహబూబ్ నగర్ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి కోరారు. అధికార టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నవీన్‌రెడ్డి మంగళవారం లక్డీకాపూల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన ఎదుగుదలను ఓర్వలేక తన సొంత పార్టీ వారే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనకు సంబంధం లేని వివాదాల్లోకి లాగి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. వెంకటేష్ అనే యువకునిపై దాడితో తనకు ఎలాంటి సంబంధం లేదని బాధితుడు కూడా తన పేరు ఎక్కడా చెప్పలేదని అయినా కూడా తనపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రాథమిక విచారణ జరపకుండానే నందిగామ పోలీసులు ఏకపక్షంగా కేసులు నమోదు చేశారని దీని వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. ఇందులో సొంత పార్టీ నేతతో పాటు మరో వ్యాపార వేత్త పాత్ర కూడా ఉందని చెప్పారు. తెర వెనుక ఉండి వీరు అక్రమ కేసులు పెట్టిస్తున్నారని తనకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. తమ పార్టీకి చెందిన నేత, మరో వ్యాపార వేత్త కలిసి తనపై కుట్ర చేస్తున్నారని అన్నారు. వీరిద్దరి నుంచి తనకు ప్రాణ హానీ ఉందని ప్రభుత్వమే రక్షించాలని కోరారు. స్థానిక పోలీసులు, నేతలు కలిసి చేస్తున్న కుట్రపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

'హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలి'

ఆమనగల్లు: హరితహారంలో గ్రామాలలో ప్రజలందరు బాగస్వాములయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ ప్రశాంత్ కుమార్ కోరారు. మొక్కల పెంపకం లక్ష్యాల పూర్తిలో అలసత్వానికి తావివ్వకూడదని పేర్కొన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లి సెంట్రల్ నర్సరీని మంగళవారం ఆయన సందర్శించారు. ఏయే ప్రాంతానికి ఎన్ని మొక్కలు పంపిణీ చేశారని, పంపిణీ చేసే మొక్కలకు సంబందించిన వివరాలను రికార్డులలో పొందపరుచాలని నర్సరీల నిర్వాహకులకు సూచించారు. మొక్కల పెంపకం ఆవశ్యకతపై అవగాహన కల్పించి ఉద్యమంగా మొక్కల పెంపకాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను కూడ సంరక్షించాలని సూచించారు. అంతరించిపోతున్న వృక్ష సంపదను పెంపొందించి భవిష్యత్తు తరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మొక్కల పెంపకం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తెరుగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రాములు, ఏరియా కో-ఆర్డినేటర్ ఉమాదేవి, ఎపిఎమ్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న ప్రశాంత్‌కుమార్

డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టిఎన్‌ఎస్‌ఎప్ నాయకులు

ఆమనగల్లు: రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ, డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా పట్టణంలో మంగళవారం టిఎన్‌ఎస్‌ఎప్ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎంగళి శ్రీధర్, జిల్లా కార్యదర్శి విజయ్‌రాథోడ్, కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. నార్కోటిక్స్, ఈడిలతో కలిసి సిట్‌ను ఏర్పాటు చేసి డ్రగ్స్ కేసుపై విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ యాదవ్, వెంకటేశ్‌గౌడ్, శివ, విక్రమ్, శ్రీశైలం, అఫ్రోజ్, నరేశ్, పరమేశ్, రాము, మణికంఠ పాల్గొన్నారు.

'గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలి'

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి గ్రామపంచాయతీ కార్మికులు జీతాలు చెల్లించాలంటూ డిమాండు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తమకు 3నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతోనే పనులు మానివేసి నిరసనకు దిగామని అన్నారు. జీతాలు ఇవ్వక పోతే ఎలా బ్రతికేదని ప్రశ్నించారు. చాలీచాలని జీతాలతో బతుకు వెళ్లదీస్తుండగా ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వక పోవడంతో నానా కష్టాలు పడుతున్నామని ఆవే దన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైె వెంటనే జీతాలు ఇప్పించాలని కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఆర్డీవో వేంకటేశ్వర్లకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

● ఏబివీపీ నాయకుల డిమాండ్

చేవెళ్ల రూరల్ /శంకర్‌పల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏబీవీపీ ఆరోపించింది. ఈ మేరకు చేవెళ్ల మండల కేంద్రంలో ఆర్డీవో వేంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. అలాగే శంకర్‌పల్లి మండలంలో తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం చేవెళ్ల, శంకర్‌పల్లి కన్వీనర్‌లు సాకేత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలు పరిస్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్పోరేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా కొమ్ముకాయడం విడ్డూరంగా ఉందని అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ నోటీపీకేషన్లు వాయిదా వేయడం అధికారుల అసమర్దతకు నిదర్శమని, గ్రూప్-2లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండు చేశారు. వసతిగృహ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించక పోతే ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీవీ నాయకులు తదితరులు ఉన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: ప్రభుత్వం విద్యారంగం సమస్యలను పరిష్కారించాలని ఎబీవీపీ మండల కన్వీనర్ మహేష్ అన్నారు. వంగళవారం షాబాద్ మండల కేంద్రంలో తహసీల్దార్ అజీజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ల్లో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని ప్రభుత్వానికి విజ్ఞాప్తి చేశారు. యూనివర్శిటీ మెస్ డిపాజిట్లను తీసేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎబీవీపీ నాయకులు సాయిరాం, అరుణ్‌కుమార్, రాఘవేందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

'ఉద్యోగులకు బదిలీలు తప్పవు'



డిప్యూటీ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అధికారులు

షాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పదని తహసీల్దార్ అజీజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాణసభలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదీలిలు పత్పదన్నారు. అదే విధంగా ఆయన చేసిన సేవాలు మరువలేనివన్ని తెలిపారు. అదే విధంగా షాబాద్ మండల ప్రజలకు ఎలా కాలం అందుబాటులో ఉండి సమస్యలు లేకుండా చూసిన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమ సీనియర్ అసిసెంట్ పాండు రంగారావు, ఆర్‌ఐ ప్రవీణ్, జూరియర్ అసిసెంట్ మహేందర్, వీఆర్వోలు అశోక్‌కుమార్, మహేందర్‌గౌడ్, నర్సింహులు, తాజ్ సిబ్బంది తదితరులున్నారు.

ముందస్తు రాఖీ పండుగ వేడుకలు



ఎంపీడీవో పద్మావతికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

షాబాద్ : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రాఖీ పండుగ వేడుకలకు ఎంపీడీవో పద్మావతి స్థానిక సర్పంచ్ వెంకట్ యాదవ్‌లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారికి బ్రహకుమారీలు రాఖీ కట్టి పండుగ విశిష్టతను వివరించారు. ఆనంతరం ఇతరులకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

'మొక్కల సంరక్షణకు కృషి చేయాలి'

మొయినాబాద్: మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూల నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో మంగళవారం బోరు వేయించారు. బుధవారం ప్రభుత్వ నిధులతో బోరు వేయించారు. నాటిన మొక్కలు సంరక్షించాలని కార్యక్రమంలో పాల్లొన్న ఎంపీపీ అనిత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుభాషిణి. స్థానిక సర్పంచ్ లక్ష్మి నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'కనీస జీతాలు చెల్లించాలి'

శంకర్‌పల్లి: ఆదర్శపాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ప్రభుత్వం చాలీచాలని జీతాలు ఇవ్వడం సరికాదని టీయూటీఎప్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఒకే పనికి ఒకే వేతనం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. అన్ని విద్యార్హతలతో పని చేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు అంజయ్య, మునీర్‌పాష లు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రెగ్యులరైజ్ ఉద్యోగులు

మొయినాబాద్: ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ప్రభుత్వం నిర్ణయంతో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కాట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు వచ్చాయని ట్రాన్స్‌కో ఉద్యోగులు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఈ జోసఫ్‌రాజ్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలందించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ సబ్‌స్టేషన్లు పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

మొయినాబాద్: మొయినాబాద్ మండల పరిది లోని పెద్దమంగళారం హనామాన్‌దేవాలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. గ్రామంలో నిర్వహిస్తున్న అభయ ఆంజనేయస్వామి సహిత నవగ్రహ, గణపతి, నూతన ఆలయ శిఖర ద్వజస్థంభ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, ఫలపుష్పషయ్యాదివాసనమ, తత్త్వన్యాస హోమము, తదితర పూజలు నిర్వహించారు. ఆలయం ముందు ద్వజ స్థంభ ప్రతిష్టాపను చేపట్టారు. వేలాంది వంది భక్తుల జయ ధ్వనుల మధ్య ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామంలోని వందలాది మంది భక్తులు పాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ సరసరాల్లో సందడి నెలకొంది.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్దమంగాళారం గ్రామం నిర్వహిస్తున్న హనుమాదేవాలయ పూజా కార్యక్రమాల్లో హైదరాబాద్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం మారు మోగింది. నేడు బుధవారంతో ఉత్సవాలు ముగియ నున్నాయి. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు సంబందించి ఏర్పాట్లు చేయడం జరిగిందిని నిర్వాహకులు తెలిపారు.



పాల్గొన్న భక్తులు

ఆంధ్రజ్యోతి
ఆమనగల్లు
5
రంగారెడ్డి, బుధవారం 2 ఆగస్టు 2017
ఆమనగల్లు । తలకొండపల్లి । మాడ్గుల । కడ్తాల్

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఆందోళన

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కన్వీనర్ భగీరథ్, కార్యదర్శి రాజు, నాయకులు ప్రేమ్ రాజ్, హరికృష్ణ, సురేశ్, రవి, జంగయ్య, మల్లేశ్, వంశీ ఉన్నారు.

కుల వృత్తుల సంక్షేమానికి పెద్దపీట

లబ్ధిదారులు గొర్రెలను అమ్ముకోవద్దు : ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి


అంతారంలో గొర్రెల్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ, జైపాల్‌యాదవ్

తలకొండపల్లి : మండల పరిధిలోని అంతారం గ్రామంలో మంగళవారం గొల్ల, కుర్మ, యాదవ్‌లకు గొర్రెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌లు హాజరయ్యారు. ప్రభుత్వం తరఫున మంజూరు చేసిన గొర్రెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్ల, కురుమ, యాదవుల సంక్షేమం కోసం గొర్రెల పంపిణీ కార్యక్రమం హర్షణీయమన్నారు. లబ్ధిదారులు గొర్రెలను అమ్ముకోకుండా అభివృద్ధి దిశగా ఎదగాలన్నారు. అన్ని కులాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నీళ్లను సాధించాలని కోరారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నికులాల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేశారని, నాయీబ్రాహ్మణ, రజక, శాలివాహన, ముదిరాజ్ తదితర కులాలకై ప్రత్యేక బడ్జెట్‌లను కేటాయించారని వారి సంక్షేమానికి తోడ్పాటునందించేలా కేసీఆర్ కృషి చేస్తున్నారని జైపాల్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సి.ఎల్.శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్, కృష్ణయ్య, మల్లయ్య, రాములు, అజీమ్, యాదగిరి, రాజు, బ్రహ్మయ్య, దస్తగిరి, యాదయ్య, శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు : రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి, విద్యారంగం బలోపేతానికి పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న మౌలిక సదుపాయాలకు తోడు పాఠశాలల్లో వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై టీఆర్ఎస్వీ వాల్ పోస్టర్ విడుదల చేసి సభ్యత్వాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌సుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇంచార్జి జి.కే.రమేశ్, కో-ఆర్డినేటర్ గోపి, కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి రవికుమార్, నాయకులు విష్ణు, నరేశ్, పరమేశ్, మల్లేశ్, రమేశ్‌రాథోడ్, స్థానిక నాయకులు అవ్వారి శివలింగం, కేశవులు, భస్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ వారం



శాంతిభద్రతల రక్షణకు చర్యలు

• రామలింగారెడ్డి, ఎస్ఐ, ఆమనగల్లు

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ రామలింగారెడ్డి కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్ర : శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి కార్యాచరణ అమలుచేస్తున్నారు.

జ: ప్రజాసంబంధాలు మెరుగుపర్చుకోవడం ద్వారా పట్టణంతో పాటు గ్రామాల నుంచి సత్వర సమాచారం పొందుతున్నాం ముందుగానే పరిస్థితిని చక్కదిద్దగలుగుతున్నాం. ఫిర్యాదులపై సత్వరం స్పందించడం ద్వారా పోలీసుశాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించాం.

ప్ర : ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

జ: శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారితోపాటు మాడ్గుల, షాద్‌నగర్ రహదారులపై పెట్రోలింగ్ పెంచాం. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం. సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

ప్ర: ప్రజలకు మీరిచ్చే సూచనలు?

జ: విధిగా సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించాలి. లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు పోలీసులకు సమాచారమివ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 100 లేదా 9440795713కి సమాచారం ఇవ్వాలి. దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

'మొక్కల సంరక్షణ అందరి బాధ్యత'


మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే

ఆమనగల్లు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు హరితహారంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాల ఆవరణలో తలకొండపల్లి మాజీ ఎంపిపి సి.ఎల్.శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, మహిళలతో కలిసి జైపాల్ యాదవ్ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లు ప్రాణవాయువుతో సమానమన్నారు. వాతావరణ సమతుల్యత లోపిస్తే మానవాళి మనుగడకు ప్రమాదమని ఈ నేపథ్యంలో చెట్లను విరివిగా పెంచాలన్నారు. హరితహారం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. నాయకులు యాదయ్య, భాస్కర్, నరేందర్‌గౌడ్, దస్తగిరి, శేఖర్, అంజి, గిరి, వెంకటయ్య, రవి, శ్రీరామ్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా యాదయ్య



ఆమనగల్లు : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆమనగల్లు మండల అధ్యక్షుడిగా పెరికేటి యాదయ్య ఎన్నికయ్యారు. పట్టణంలోని వెంకట నర్సింహ గార్డెన్‌లో మంగళవారం రాష్ట్ర ప్రచార కార్యదర్శి కానుగుల దశరథం అధ్యక్షతన నాయీబ్రాహ్మణ సంఘం సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్వాయి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సిద్ధులు, ఉపాధ్యక్షుడు మల్లారి రమేశ్‌ల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా పెరికేటి యాదయ్య, ఉపాధ్యక్షునిగా పెరికేటి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ రమేశ్, కార్యదర్శిగా రామచంద్రయ్య, కోశాధికారిగా బాలయ్య లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీకి శ్రీనివాస్, సిద్ధులు, దశరథంలు, ఎన్నిక పత్రాన్ని అందజేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి యాదయ్య, సంఘం నాయకులు కోటయ్య, జంపుల యాదగిరి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం తగదు : గూడూరు


మాట్లాడుతున్న డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి జైపాల్ యాదవ్ విమర్శించడం తగదని డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్‌నాయకులతో కలిసి విలేఖరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డిని టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి జైపాల్ యాదవ్‌ను విమర్శించడం సరైంది కాదని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని నీవు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏమి అభివృద్ధి చేశావో ప్రజలకు వివరించాలని శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఎమ్మెల్యే పనితీరుపై సర్వే చేసి కల్వకుర్తి పీఠం మళ్లీ కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్తుందని సర్వేలో తేలిన విషయం మరిచిపోయావా అని జైపాల్ యాదవ్‌కు హితవు పలికారు. డిసిసి ప్రధాన కార్యదర్శి లాయక్‌అలీ, ఎంపిటిసి చేగూరి వెంకటేశ్, గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు అశోక్,మల్లేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌కు తెలుపకుండా పనుల ప్రారంభమెలా?


మాట్లాడుతున్న సర్పంచ్ నర్సింహ

కడ్తాల్ : గ్రామ అభివృద్ధి పనుల ప్రారంభంలో స్థానిక సర్పంచ్‌కు తెలుపకుండా సిసి రోడ్డు పనులను మంత్రి మహేందర్ రెడ్డి ప్రారంభించడమేమిటని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మక్తమాదారం సర్పంచ్ యాట నర్సింహ అన్నారు. మంగళవారం కడ్తాలలో మాట్లాడుతూ సోమవారం మక్తమాదారం పంచాయతీ పరిధిలోని రేక్య తండాలో తనకు తెలియకుండా టిఆర్ఎస్ నాయకులు, మంత్రితో సిసి రోడ్డు ప్రారంభించడం సరైంది కాదని గ్రామంలో ప్రభుత్వ అధికారిక పనులు ప్రారంభం ఏదైనా సర్పంచ్‌కు సమాచారం అందించాలని తమ గ్రామంలో ప్రోటోకాల్ పాటించకుండా మంత్రిసిసి రోడ్డు ప్రారంభించడాన్ని ఖండిస్తున్నానని అన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణానాయక్, మోత్యనాయక్, రాములు, బాల్‌రాజ్, చెన్నయ్య ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మాడ్గుల : మాడ్గుల మండల సర్వసభ్య ఈనెల 3న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జైపాల్ నాయక్ మంగళవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించే ఎంపిపి జైపాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

నర్సరీల పరిశీలన

తలకొండపల్లి : మండల పరిధిలోని యెడవల్లి, చీపునుంతల గ్రామాలలో అటవీ శాఖ నర్సరీలను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసాచార్య పరిశీలించారు. మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మొక్కలకు సరఫరా చేసే నీటిని పరిశీలించారు. అన్ని గ్రామాలకు సరిపడా మొక్కలు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కడ్తాల్: మండలంలోని వివిధ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఆపరేటర్స్, పిట్టర్స్‌ను ప్రభుత్వం రెగ్యులర్ చేయడంతో మంగళ వారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తమ కష్టానికి స్వరాష్ట్రంలో ఫలితం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు వెంకటేశ్, శ్రీను, దేవా లాల్, మహేశ్, శ్రీను, శ్రీనాథ్, లింగస్వామి, ఏ.వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ముద్విన్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బస్ డిపో నుంచి ముద్విన్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం డిపో మేనేజర్ సి.హేమంత్‌రావుకు వినతిపత్రమందజేశారు. ముద్విన్ నుంచి బస్సు లేకపోవడంతో కాలినడకన నాలుగు కిలోమీటర్లు వచ్చి సరికొండ నుంచి రావాల్సి వస్తుందని అన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. డీఎంను కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు బుగ్గరాములు, స్టాలిన్, జంగయ్య తదితరులున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని

ఏబీవీపీ ఆందోళన

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బూరదిలీప్‌గౌడ్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను మూసివేయవద్దని అన్నారు. హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గునుకుల మల్లేష్, బాగ్ కన్వీనర్ బీరప్ప, శాంతికుమార్, శిరీష, శ్రీశైలం, రమేష్, రాణాప్రతాప్ తదితరులున్నారు.



యాచారం తహసీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థినాయకులను ప్రశ్నిస్తున్న ఎంఈవో వినోద్‌కుమార్, తహసీల్దారు పద్మనాభరావు

'విద్యారంగ సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం'



ఇబ్రహీంపట్నం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

యాచారం : ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఏబీవీపీ జిల్లా నాయకుడు ఐలేష్ విమర్శించారు. విద్యారంగ సమస్యలు తీర్చాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాయలం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటర్ అడ్మిషన్లను ఆన్‌లైన్ పద్ధతిన తీసుకునేరీతిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తెలంగాణ పోలీస్ పాలసీ 30 యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు పద్మనాభరావుకందించారు.

ఏబీవీపీ నాయకుల తీరుపై ఎంఈవో ఆగ్రహం

సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల అనుమతి లేకుండా విద్యార్థులను తరగతి గది నుంచి బయటకెందుకు తీసుకొచ్చారని ఎంఈవో వినోద్‌కుమార్ ఏబీవీపీ నాయకుడు ఐలేష్‌పై ఆగ్రహం చెందారు. తమ అనుమతి లేకుండా ధర్నాకు విద్యార్థులను బయటకు తీసుకెళ్లరాదన్నారు. ఇక నుంచి ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అనుమతి లేకుండా విద్యార్థులను బడి బయటకు తెస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు.



ఎమ్మార్పీఎస్ రిలేనిరాహార దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న వైస్‌ఎంపీపీ దన్నెబాషయ్య తదితరులు

'వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి'

మంచాల : వర్షాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బండమీది కృష్ణ, అధ్యక్షుడు ఏర్పుల మల్లేష్ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంచాల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షలకు బీజేపీ జిల్లానాయకుడు దన్నెబాషయ్య, మండల కోఆప్షన్‌సభ్యుడు ఎండీ.సలాం సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్, నర్సింహ, రవికుమార్, సదానందం, ముత్యాల కృష్ణ, నరేందర్, శ్రీనివాస్, జంగయ్య, శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలను నిరసిస్తూ నేడు రంగాపూర్ నుంచి పాదయాత్ర

ఇబ్రహీంపట్నం: రైతు ఆత్మహత్యల నిరసిస్తూ తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంచాల మండలం రంగాపూర్‌నుంచి ఇబ్రహీంపట్నం వరకు బుధవారం మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ నిర్వహించనున్న పాదయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యాత్రలో టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ పాల్గొంటున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. అంతేగాక పలు ప్రజాసంఘాల సంఘాల నాయకులుకూడా ఈ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు తెలిపారు. రంగాపూర్‌లో ఇటీవల మోహనాచారి, సరిత దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం విదితమే. కాగా ఈ పాదయాత్రను ఇక్కడ నుంచే అంటే రంగాపూర్ నుంచి జాపాల్, మంచాల, నోముల గుండా ఇబ్రహీంపట్నం వరకు నిర్వహించనున్నారు.

'వెంచర్లు, వృథా భూముల్లో మొక్కలు పెంచండి'

యాచారం : మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న వెంచర్లలో, వృదా భూముల్లో మొక్కలు నాటించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.మధుకర్ రెడ్డి వివిధ శాఖల అధికారుల సమావేశంలో చెప్పారు. నాటిన ప్రతి మొక్క ఎండిపోకుండా చూడాలన్నారు. మొక్కల సంరక్షణపై తగు చొరవ తీసుకోవాలన్నారు. మండలంలో వచ్చే వారం నాటికి 80వేల మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇండ్లలో పండ్లు, పూలమొక్కలను ప్రజలకు అందించాలని ఆదేశించారు. అడవుల్లో వృధా స్థలాల్లో మొక్కలు నాటించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.ఉష, వ్యవసాయాధికారి జి.ఎస్.సందీప్‌కుమార్, ఎంఈవో పి.ఎస్.వినోద్ కుమార్, ఈవోఆర్డీ శంకర్‌నాయక్, ఉపాధి హామీపథకం ఏపీవో నాగభూషణం ఉన్నారు.



యాచారంలో వివిధ శాఖల అధికారుల సమీక్షలో పాల్గొన్న ఆర్డీవో మధుకర్‌రెడ్డి

అనంతపూర్ మార్కెట్‌ను సందర్శించిన

'పట్నం' మార్కెట్ కమిటీ పాలకవర్గం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం అవగాహనా యాత్రలో భాగంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ మార్కెట్‌ను సందర్శించారు. ఇక్కడ టొమాటో పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడే పండ్ల మార్కెట్, గొర్రెలు, పశువుల సంతను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పండ్ల మార్కెట్ బిల్డింగ్‌ను పరిశీలించారు. ఈ-నామ్ అమలులో తెలంగాణ రాష్ట్రం ముందుందని మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి అన్నారు.

రాప్తాడులో ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తమ రైతు శివశంకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి అధునాతన పద్ధతుల్లో పంటలసాగు, అంతర పంటలను పరిశీలించారు. సాయంత్రం బెంగుళూరు మార్కెట్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దండేట్ కార్‌రవి, డైరక్టర్లు ఏనుగు బుచ్చిరెడ్డి, జె.కిషన్‌రెడ్డి, ఎండీ జహీర్, చీమల జంగయ్యయాదవ్, పొన్నాల జగదీష్, మచ్చ లక్ష్మణ్, ఓ.యాదయ్యగౌడ్‌లు న్నారు.




తీగజాతి పంటలకు స్ప్రేచేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న 'పట్నం' మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

టీఆర్‌ఎస్‌వీ సభ్యత్వ నమోదు

మంచాల : టీఆర్ఎస్ అనుబంధ విద్యార్థిసంఘం సభ్యత్వ నమోదును మంగళవారం మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘం నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా నాయకుడు బుస్సు పుల్లారెడ్డి, ఎండీ.జానీపాష, టీఆర్ఎస్‌వీ నాయకులు మొగిలి మహేష్, లింగానాయక్, ఆనంద్, యువజన సంఘం నాయకులు సీహెచ్.జంగయ్య, మంకువినోద్, విష్ణు, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, బాలరాజు, ఆనంద్, అస్లాం, శివారెడ్డి, విక్రంగౌడ్, రాకేష్, విజయ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



టీఆర్ఎస్‌వీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న నాయకులు



ఆరుట్ల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు 3ఆర్ఎస్ విధానం ప్రారంభం

విద్యార్థులకు చతుర్విద ప్రక్రియలు

మంచాల : చతుర్విద ప్రక్రియల్లో భాగంగా మంగళవారం ఆరుట్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 6-9 తరగతుల విద్యార్థులకు 3ఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు కిషన్‌చౌహాన్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుపంపిణీ..

మంచాల : మంచాల మండల పరిధి ఆగాపల్లికి చెందిన జి.పరమేష్‌కు మంగళవారం ఎ మ్మెల్సీ కర్నెప్రభాకర్ చేతుల మీదుగా 44 వేల రూ.ల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకుడు కర్నెఅరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ అక్కర్లేదు..

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ భూములపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నందున సీబీఐ విచారణ అక్కర్లేదని రెవెన్యూశాఖ పేర్కొంది. ఈ భూముల కుంభకోణంలో సీబీఐ విచారణ జరిపించాలని దాఖలైన పిల్ విచారణలో భాగంగా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా సోమవారం అఫిడవిట్ దాఖలు చేశారు. 2016 నవంబరు 19న శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లో సర్వేనెం.101, 20, 28, 100లలో 693 ఎకరాల ప్రభుత్వ భూముల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసుపై సీబీఐ విచారణ జరిపించాలని పిల్ దాఖలుకాగా... హైకోర్టు నోటీసులతో రెవెన్యూశాఖ అఫిడవిట్ సమర్పించింది. అయితే ఈ భూముల వివాదం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని...రెండు ప్రైవేట్ పార్టీల మధ్య వివాదం నడుస్తోందని... ఆ కేసులో తాము ప్రతివాదులుగా లేమని గుర్తు చేశారు. భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేశామని నివేదించారు. దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం కొట్టివేయాలని కోరారు. మరోవైపు ఈ భూముల కేసు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా... ఆ భూమి మాదంటే మాదని రెండు ప్రైవేట్ పార్టీలు క్లెయిమ్ చేస్తుండగా ఈ కేసులో ప్రభుత్వం ప్రతివాదిగా చేరకపోవడం అనుమానాలు కలిగిస్తోంది.

ఆదర్శ రైతుల సంఘం మాజీ అధ్యక్షుడి మృతి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్: ఆదర్శ రైతుల సంఘం ఫరూఖ్‌నగర్ మండల శాఖ మాజీ అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి వీసీ ఇన్‌చార్జి లట్టుపల్లి మోహన్‌రెడ్డి సోదరుడు లట్టుపల్లి శ్రీనివా‌స్‌రెడ్డి(53) ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం రాత్రి స్వగ్రామమైన మధురాపురంలోని కింద పడిన శ్రీనివాస్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అతన్ని చికిత్స కోసం తరలించారు. అయితే ఆపరేషన్ అనంతరం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఆదర్శ రైతుల సంఘం మండల శాఖ అధ్యక్షునిగా పనిచేసి ఎంతో మందికి వ్యవసాయంలో మెలకువలు నేర్పించారు. మండలంలోని పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచారు. శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం మధురాపురం గ్రామంలో జరిగాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ మంత్రి డాక్టర్ పి. శంకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సి. ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి విశ్వం, బీజేపీ తెలంగాణా విమోచన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. శ్రీవర్ధన్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త పాతూరి వెంకట్రావులతో పాటు పలువురు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

'25వేల నవీన క్షౌర శాలల ఏర్పాటు'


మాట్లాడుతున్న పొల్కాయి శ్రీనివాస్

ఆమనగల్లు : రాష్ట్రంలో 25వేల నవీన క్షౌరశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొల్కాయి శ్రీనివాస్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటన ర్సింహ గార్డెన్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రచార కార్యదర్శి కానుగుల దశరథం అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సిద్దులు ,ఉపాధ్యక్షుడు మల్లారి రమేశ్ లు ముఖ్య అతిథులుగా హజరయ్యారు . అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం మేరకు నవీన క్షౌరశాలల ఏర్పాటుకు సంబంధించి ఈనెల 8న మంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్నల ఆధ్వక్షతన సమావేశం నిర్వహించి విధివిధానాలను ఖరారు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి యాదయ్య, మండల అధ్యక్షుడు పెరికేటి యాదయ్య, ఉపాధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి దేవర కొండ రమేశ్, నాయకులు గణేశ్, తానయ్య, పెద్దయ్య , రమేశ్, యాదగిరి, మూర్తి , రాంచంద్రయ్య, నర్సింహ్మ , బాలు, సైదులు , యాదయ్య, బిక్షపతి, పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద దాడికి పాల్పడిన నిందితుల అరెస్ట్

- నిందితులకు 14 రోజుల రిమాండ్
- అధికార పార్టీ నేత కుమారుడు, స్నేహితుల వీరంగం
- రూ.30 టోల్ ఫీజు చెల్లింపుపై ఘర్షణ
- కారు ఆపినందుకు సిబ్బందిపై దాడి
- సూపర్‌వైజర్‌ని వెంటాడి కత్తితో పొడిచిన వైనం
- నిందితులను కేసు నుంచి తప్పించే యత్నం

ఆమనగల్లు / కడ్తాల్ : అధికార పార్టీ నేత కుమారుడు, అతని స్నేహితులు తప్పతాగి కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద వీరంగం సృష్టించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కల్వకుర్తి మున్సిఫ్‌కోర్టు ఆరుగురికి 14రోజుల పాటు రిమాండ్ విధించింది. సోమవారం రాత్రి అధికార పార్టీ నాయకుడి కుమారుడు కడ్తాల్ వద్ద టోల్ ఫీజు కట్టకుండా వెళుతున్న వాహనాన్ని ఆపినందుకు స్నేహితులతో కలిసి సిబ్బందిపై కత్తి తీసి దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడిలో సూపర్ వైజర్ గాయాలతో బయటపడ్డాడు. ఆ తర్వాత ఆ యువకులు కారులో పారిపోతుండగా టోల్‌సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కడ్తాల్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తమ సిబ్బందితో మాటు వేసి వారిని పట్టుకున్నారు. ఇదిలా ఉండగా టోల్‌ప్లాజా సూపర్ వైజర్ మహేశ్‌ది కడ్తాల స్వస్థలం కావడంతో దాడి వార్త తెలియగానే స్థానికులు ,కుటుంబీకులు , స్నేహితులు, వివిధ పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వాస్తవానికి ఈ ఘర్షణ అంతా రూ. 30ల టోల్ ఫీజు చెల్లించే విషయంలో జరగడం గమనార్హం.


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి

కేసు తప్పించేయత్నం

ఈ సంఘటనపైస్టేషన్ వద్ద అర్ధరాత్రి వరకు హైడ్రామా నెలకొంది. ఎల్‌బీనగర్ టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ముద్దగోని రామ్మోహన్ గౌడ్ కుమారుడు ఉండటంతో కేసు నుంచి తప్పించేందుకు కొందరు నాయకులు యత్నించారు. మహేశ్‌ను ఫిర్యాదు తిరిగి తీసుకోవడానికి పెద్ద ఎత్తున బేరసారాలు కూడ సాగినట్లు సమాచారం. కేసు నమోదులో కూడా ఆలస్యం చేశారు. రామ్మోహన్ గౌడ్ కూడ అర్ధరాత్రి కడ్తాలలోని మహేశ్‌ఇంటికి చేరుకొని జరిగింది పొరపాటే అని అతనికి నచ్చజెప్పె ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయినట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో వెంటనే కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడిన ఆరుగురి అరెస్ట్...

టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ మహేశ్‌పై దాడికిసంబంధించి ఆరుమంది యువకులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. సోమవారం జరిగిన దాడికి సంబంధించి బొప్పిడి అరుణ్ కుమార్ రెడ్డి, కేత నిశిత్ , తాళ్లపల్లి సాయితేజరెడ్డి, ముద్దగోని మనీష్ గౌడ్, సామ సాయి కుమార్, మారుపాకుల అనిరుధ్ గౌడ్‌ల పై మహేశ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదే రాత్రి వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం కల్వకుర్తి కోర్టులో హజరుపరిచినట్లు ఎస్‌హెచ్ఓ శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులపై ఐపీఎస్ 148, 307,506ఆర్/ డబ్ల్యు కింద కేసు నమోదు చేశారు.


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

సూపర్‌వైజర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ఈ ఘటనలో గాయపడిన టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ గాయపడటంతో విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి మంగళవారం కడ్తాల్‌లోని ఇంటికి వెళ్లి మహేశ్‌ను పరామర్శించారు. దాడికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స కోసం మహేశ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి తెలిపారు.

వంట.. మంట

- వంట గ్యాస్‌కు మంగళం..
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పెనుభారం
- ప్రతి నెలా రూ.4కు పెంచుతూ చివరకు స్వస్తి
- వంట గ్యాస్ మంటగా మారుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : వంట గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఆ భారాన్ని ప్రజలపై రుద్దేందుకు నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని ఎత్తివేసేందుకు సిలిండర్‌పై నెలా రూ.4 పెంచాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్‌పై రాయితీని ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకోవటంపై పేద మధ్యతరగతిపై మోయలేని భారం పడనుంది. ఒకేసారి కాకుండా ప్రతి నెలా ధర పెంచుతూ.. కొన్నాళ్లలో రాయితీకి మంగళం పలికేందుకు చూస్తుంది. వంట గ్యాస్ సబ్సిడీ ఎత్తివసేందుకు కేంద్ర తీసుకున్న నిర్ణయంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్‌పై రాయితీ ఎత్తివేయాలనే నిర్ణయాన్ని వెనక్కీ తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 41 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థలు ప్రతి నెలా వినియోగ దారులకు గ్యాస్‌ను సరఫరా చేస్తుంది. జిల్లాలో మొత్తం 303654 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో సాధారణ కనెక్షన్లు 717245 ఉన్నాయి. అదే విధంగా దీపం కనెక్షన్లు 113312 కనెక్షన్లు ఉండగా సీఎస్ఆర్ కనెక్షన్లు 38815 ఉన్నాయి. ప్రస్తుతం రాయితీ వంట గ్యాస్ సిలిండర్ రూ.477.46 గా ఉండగా గ్యాస్ ఏజెన్సీలు రూ.630 వినియోగదారులకు అందజేస్తున్నారు. రూ. 153 సబ్సిడీ డబ్బులను వినియోగదారుల ఖాతాలో జమజేస్తుంది. గ్యాస్ సిలిండర్‌ను ఇంటి వద్దకు తీసుకు వచ్చి సరఫరా చేస్తున్నందుకు గాను అదనంగా రూ. 30 తీసుకుంటున్నారు. ఇప్పటికే భారంగా భావిస్తున్న సామాన్యులకు సబ్సిడీ ఎత్తివేత కారణంగా మరింత భారంగా మారనుంది. జిల్లాలో 303654 గ్యాస్ సిలిండర్లకు గాను నెలకు రూ. 4 పెంచితే వినియోగదారులపై రూ.12 లక్షల భారం పడుతుంది. అలాగే ఏడాది పాటు పెంచిన ధరను లెక్కిస్తే.. రూ. 1.51 కోట్లు భారం పడుతుంది. పెరుగుతున్న నిత్యావసరాలకు ఉక్కిరిబిక్కిరవుతున్న సామాన్యులకు వంట గ్యాస్ మంటగా మారింది. సబ్సిడీ ఎత్తివేస్తుండటంతో మళ్లీ కట్టెల పొయ్యే బెటరనుకుంటున్నారు. వంట చెరుకుకు డిమాండ్ పెరగనుంది.

కట్టెల పొయ్యి బెటర్..



రాయితీ ఎత్తివేస్తే కట్టెల పొయ్యి బెటర్. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కీ తీసుకోవాలి. పేదలకు అందించే వంటగ్యాస్ సిలిండర్‌పై రాయితీ కల్పించాలి. రాయితీ విషయంలో ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ పై రాయితీ ఎత్తి వేయడం చాలా దారుణం. ఇప్పటికే పెరిగిన ధరలతో పేద మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

పి.హేమలత, గున్‌గల్

ప్రజలపై భారం మోపొద్దు..



కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రాయితీని ఎత్తి వేస్తున్న మని ప్రకటించే ముందు ప్రజల స్థితిగతులను తెలుసుకోవాలి. రెక్కాడితే కాని డొక్కాడని గ్రామీణ ప్రజలపై కేంద్రం గ్యాస్ రాయితీ ఎత్తివేసే దిశగా ప్రకటించడం మంచి పద్ధతి కాదు. రాయితీ ఎత్తివేత నిర్ణయం కేంద్ర ప్రభుత్వం వెనక్కీ తీసుకోవాలి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సరైనది కాదు. మరోసారి పునరాలోచించాలి. ప్రతి ఒక్కరికి గ్యాస్ తప్పనిసరి. వంట గ్యాస్ లేకుంటే కష్టం. ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ రాయితీని ఎత్తివేయాలనుకోవడం సరైంది కాదు. ఈ విషయంలో మరోసారి ఆలోచించాలి.

హన్మంత్, చేవెళ్ల

శంషాబాద్‌లో మంగళవారం టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆర్. గణేశ్‌గుప్తా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర నాయకుడు బుక్కా గోపాల్, జాంగీర్‌ఖాన్, జ్ఞానేశ్వర్‌యాదవ్, ఈ. అజయ్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు పాల్గొని గణేశ్‌గుప్తాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

-శంషాబాద్



5, 6న మహేశ్వరంలో

'ఖేల్ భారత్' క్రీడోత్సవాలు



మాట్లాడుతున్న యాదీష్

మహేశ్వరం: పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మహేశ్వరం మండలంలో 'ఖేల్ భారత్' క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల ఎంపీటీసీ తెల్లమళ్ల యాదీష్ తెలిపారు. మంగళవారం మహేశ్వరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టు 5, 6 తేదీల్లో మండల కేంద్రంలోని అక్కన్న మాదన్న మైదానంలో కబడ్డీ, ఖోఖో, టగ్ ఆఫ్ వార్ క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. యువతలో జాతీయ బావాలు పెంపడమే క్రీడల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 18 నుండి 30 సంవత్సరాల యువతీ యువకులు ఈ క్రీడల్లో పాల్గొనాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతి 11 వేలు, ద్వితీయ బహుమతి 6 వేలతో పాటు మెమోంటోలు బహుకరించబడుతాయని తెలిపారు. మహేశ్వరంలో నిర్వహించే ఈ క్రీడలను ప్రారంభించేందుకు బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు బి.పాపయ్యగౌడ్, ఆచారి, నిర్మల్‌రావు, ప్రేంరాజ్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. క్రీడల వివరాలను తెలుసుకునేందుకు 9848905061, 9640609060, 9948580331 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు సిద్ధు, రఘు, భరత్, సాయి, శ్రావన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నిర్వహించే సదస్సులను

వినియోగించుకోవాలి: తహసీల్దార్

కందుకూరు: గ్రామాల్లో మిగిలిపోయిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి నేరుగా అధికారులు వచ్చి నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ పి.క్రిష్ణకుమార్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని పంజగూడ, గుమ్మడవెల్లి, మాదాపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని మాట్లాడారు. మూడు గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం 18 ఆర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకులమైలారం ఎంపీటీసీ కరుణశ్రీ, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జంగయ్య, వీఆర్‌వోలు సుదర్శన్, రమేష్‌బాబు, కృష్ణ, సిబ్బంది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్: మండల కేంద్రం శంషాబాద్‌లో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ బస్టాండ్, ఎయిర్‌పోర్టు చౌరస్తా, కొత్వాల్‌గూడ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వాహనాలు నడిపేవారిని ఆటో డ్రైవర్లను సమావేశపరిచి ట్రాఫిక్ నిబంధనలు చెప్పి వారిలో చైతన్యం తెచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు ఆటోయూనియన్, టాక్సీ యూనియన్ నాయకులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు

ప్రభుత్వం కట్టుబడి ఉంది

● వచ్చే రెండేళ్లలో వందశాతం సీసీ రోడ్ల ఏర్పాటుకు చొరవ ● ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కందుకూరు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నట్లు మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడ గ్రామ పంచాయితీలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీల ఏర్పాటుకు ఎమ్మెల్యే కోటా నుంచి 10లక్షల నిధులను మంజూరు చేసి, ఆ గ్రామ సర్పంచ్ ఆర్ యాదయ్యకు మంజూరు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు గ్రామాల అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న అనంతరం అన్ని గ్రామాల్లో కులవృత్తులను నమ్ముకున్న వారికి పెద్దపీట వేసి ప్రత్యేకంగా ఆ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రెండు సంవత్సరాల్లో మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో వందశాతం సీసీ రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడానికి ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జి. లక్ష్మీనర్సింహారెడ్డి, పి.భిక్షపతి, ఎండి హంజన్,వంద్రయ్య, కర్నాకర్‌రెడ్డి, ఎండి షమీర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడ సర్పంచ్ యాదయ్యకు ప్రొసిడింగ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

శంషాబాద్‌లో ఘనంగా బోనాలు



బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: మండల కేంద్రం శంషాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లో మంగళవారం బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో కమిటీ సభ్యులు మోండాదారులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మార్కెట్‌లోని పోచమ్మతల్లి దేవాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చంద్రారెడ్డి, మేకల వెంకటేష్, దీపా, సిద్దులు, సుదర్శన్, మహ్మద్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, వెంకటేష్, శంకర్, జితేందర్, దేవేందర్, సంజీవరావు, సిద్దులు, మహేందర్, కిట్టు, బాల్‌రాజ్, నరేష్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం ఆగదు'

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బక్కని రవి



ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి రవి మాదిగ

మహేశ్వరం: ప్రభుత్వాలు పాలకులు మారుతున్నారు తప్ప ఎస్సీ వర్గీకరణబిల్లును మాత్రం పార్లమెంటులో అమలు చేయలేకపోతున్నారని, వర్గీకరణ సాధించే వరకు ఎమ్మార్పీఎస్ తల పెట్టిన ఉద్యమాలను ఆపేది లేదని ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి బక్కని రవి అన్నారు. మంగళవారం మహేశ్వరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీ వర్గీకరణకై రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడిని పెంచాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్య, గణేష్, మనోహర్, సందీప్, యాదగిరి, శ్రీకాంత్, పవన్, ప్రవీన్ పాల్గొన్నారు.

శంషాబాద్ మండలంలో..

శంషాబాద్: మండల కేంద్రం శంషాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం పార్లమెంటులో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ నాయకులు మదిరేటి మాట్లాడుతూ బిల్లు ప్రవేశపెట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షకు ఎంపీటీసీ అరవింద్, సునీల్, కృష్ణ, సాయి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి కే.శంకర్‌రావు సత్యం, రమేష్, జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

'పాఠశాల దశ నుంచే కెరీర్‌పై దృష్టి సారించాలి'

శంషాబాద్‌రూరల్: విద్యార్థులు పాఠశాల దశ నుంచే కెరీర్‌పై దృష్టి సారించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ సుధాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని పాల్మాకుల మోడల్ స్కూల్‌లో ఇంటిగ్రేటెడ్ సివిల్ సర్వీస్ అకాడమీ, టీకేఎస్‌ఏ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే సరైన గైడెన్స్ ద్వారా చదువుతారో వారే ఉన్నత స్థానంలో నిలుస్తారని చెప్పారు. కొన్ని ప్రయివేట్ స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాధికారి రాంరెడ్డి, ప్రిన్స్‌పాల్ విష్ణుప్రియ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై

తహసీల్దార్‌కు వినతి పత్రం

శంషాబాద్: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ విద్యార్థులు మండల తహసీల్దారుకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ టౌన్ కన్వీనర్ మనోహర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యారంగానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఇంటర్ అడ్మిషన్ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని ప్రభుత్వం హామి ఇచ్చి నెరవేర్చలేదన్నారు. ఈకార్యక్రమంలో అమూల్య, అంబిక, విధూషి,జాఫర్, ప్రేం, గోపాల్,మహేష్, క్రాంతికేశవ్, రమేష్, అరవింద్, శ్రీకాంత్‌గౌడ్,అరుణ్, మహేశ్, రాకేశ్, మిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిప్పలపల్లి గ్రామ

భవన కార్మిక సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన భవన కార్మిక సంఘం కమిటీ సభ్యులు

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లి గ్రామ భవన కార్మిక సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బండి సత్తయ్య ప్రకటించారు. మంగళవారం కందుకూరులో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. భవన కార్మిక సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయి కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా చిప్పలపల్లి అధ్యక్షుడిగా పొట్ట పరుశురాములు, ఉపాధ్యక్షుడిగా పోలెమోని రాజు, కోశాధికారిగా కుమార్, కార్యదర్శిగా బాలక్రిష్ణ, సలహాదారులుగా పి.భిక్షపతి, కె.భిక్షపతి, కె.రమేష్, పి.నారాయణ, క్రిష్ణ, సి.యాదగిరి, ఎ.లింగం, కె.వెంటయ్య, సి.క్రిష్ణ, సుదర్శన్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రాములు, లక్ష్మయ్య, యాదయ్య, కొండయ్య, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

కేశంపేట: పేద ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. అదేవిధంగా కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వర్కాల లక్ష్మమ్మ, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవో పద్మజ, టీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు ఎన్. మురళీధర్ రెడ్డి, సర్పంచులు అమృతమ్మ, అంజిరెడ్డి, జగదీశ్వర్, కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, టీఆర్ఎస్ నాయకులు వర్కాల లక్ష్మీ నారాయణగౌడ్, నారాయణరెడ్డి, యాదగిరిరావు, వేణుగోపాలచారి తదితరలు పాల్గొన్నారు.

రూ.10కోట్లతో చేగూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్

ఆంధ్రజ్యోతి/ఇంటర్వ్యూ



చరణ్‌సింగ్, ట్రాన్స్‌కో ఏడీఈ, కొత్తూర్

కొత్తూర్: కొత్తూర్ ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు ట్రాన్స్‌కో కసరత్తులు మొదలుపెట్టింది. కొత్తూర్ సబ్ డివిజన్ పరిధిలో కేశంపేట, నందిగామ మండలాలున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తూర్ పారిశ్రామకవాడ అతి పెద్దది. అయితే అటు పరిశ్రమలకు, ఇటు గృహాలకు విద్యుత్ సరఫరా మెరుగు పరిచేందుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో నందిగామ మండల పరిధిలోని చేగూర్ గ్రామ శివారులో 220/132/33 విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం 10కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఇందుకు గాను స్థల సేకరణ పూర్తి కావచ్చింది. త్వరలో నిర్మాణం పనులు ప్రారంభంకాబోతున్న నేపథ్యంలో కొత్తూర్ ఏడీఈ చరణ్‌సింగ్‌తో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ..

ప్ర: కొత్తూర్ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సర ఫరా మెరుగు పరిచేందుకు ఎలాంటి కృషి చేస్తున్నారు?

జ: కొత్తూర్ పారిశ్రామకవాడతో పాటు గృహాల విద్యుత్ సరఫరాలో ప్రస్తుతం లోడ్ ఎక్కువగా ఉన్నందున, లోడ్ తగ్గించేందుకు చేగూర్‌లో దాదాపు రూ.10కోట్ల రూపాయలతో 220/132/33 సబ్‌స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుంది.

ప్ర: కొత్తగా ఏమైనా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారా?

జ: అవసరం ఉన్నా చోట అదనపు విద్యుత్ తీగల కోసం కోటి రూపాయలు మంజూరయ్యాయి. సబ్‌డివిజన్ పరిధిలో వేలాడుతున్న తీగలను సరి చేసి అదనపు తీగలను ఏర్పాటు చేయిస్తాం.

ప్ర: అదనపు స్తంబాల కోసం ప్రతిపాదనలు పంపించారా.

జ: సబ్‌డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాలలో 300 అదనపు స్తంబాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం. స్తంబాలు మంజూరైన వెంటనే వాటిని ఏర్పాటు చేస్తాం.

ప్ర: పరిశ్రమలకు సంబంధించిన బకాయిలు ఏమైనా ఉన్నాయా?

జ: ఏమీ లేవు. గృహాలు, వ్యవసాయానికి సంబంధించిన బిల్లులు బకాయిలు ఉన్నాయి. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలి.

సమగ్ర సర్వేలో రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

● ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ప్రభుత్వం వచ్చే ఖరీఫ్ నుంచి రైతులకు ఎకరానికి 4వేల రూపాయల చొప్పున సాగు ఖర్చులు ఇవ్వడానికి నిర్ణయించింది. ఇందుకు మండల వ్యవసాయాధికారి రైతుల సమగ్ర వివరాలు పక్కాగా నమోదు చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ వర్కాల లక్ష్మమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా వచ్చే ఆరు నెలల్లో షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు ఇంటింటికీ నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ నిర్వహిస్తున్న హరితహారంలో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగారం యాదమ్మ, జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవో పద్మజ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విమోచన దినాన్ని అధికారికంగా ప్రకటించాలి

● తెలంగాణ విమోచన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కొత్తూరు: సెప్టెంబర్ 17ను విమోచన దినంగా ప్రకటించాలని తెలంగాణ విమోచన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా ప్రకటిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మరిచారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే సెప్టెంబర్ 17ను అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అశోక్‌గౌడ్, బావాండ్ల మాణిక్యం, వెంకటయ్య, నాగరాజుచారి, శ్రీనివాస్, కుమార్‌గౌడ్,రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దిగ్రేట్ వాల్ కైండ్‌నెస్' ప్రారంభం



దిగ్రేట్ వాల్ కైండ్‌నెస్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని వినాయక గంజ్‌లో మంగళవారం దిగ్రేట్ వాల్ కైండ్‌నెస్‌ను ప్రారంభించారు. లయన్స్ క్లబ్ షాద్‌నగర్ టౌన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ యాదమ్మపెంటయ్య, మున్సిపల్ చైర్మన్ విశ్వం హాజరై దిగ్రేట్ వాల్ కైండ్‌నెస్ బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.వీ.ఎస్.రంగయ్య మాట్లాడుతూ ఎవరి ఇంట్లోనైనా ఉపయోగం లేని వస్తువులు ఉంటే తీసుకువచ్చి ఇక్కడ వదిలేయాలని తెలిపారు. అలాగే ఇక్కడ ఉన్న వస్తువులలో ఉపయోగమైన వస్తువులను కూడా తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రీయిజన్ చైర్మన్ సాయికృష్ణ, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు యంసాని శ్రీనివాస్, కృష్ణారెడ్డి, డాక్టర్ ప్రేమ్‌సాయి కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి మెడిసిన్‌లో సీటు



మనీష (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన పేద విద్యార్థిని మనీషకు మెడిసిన్ సీటు దక్కింది. మనీష తండ్రి మృతిచెందగా తల్లి వనజ కుట్టు మిషన్ కుడుతూ తన ఇద్దరి ఆడపిల్లలను చదివిస్తుంది. అయితే నీట్ వైద్య పరీక్ష రాసిన మనీష 78,557 ర్యాంకు సాధించి సంగారెడ్డిలోని ఏఎంఆర్ మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకుంది. దీంతో మనీషను పలువురు అభినందించారు.

కాంక్రీట్ మిల్లర్ల కమిటీ ఎన్నిక

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ తాలుకా కాంక్రీట్ మిల్లర్స్ అసోసియేషన్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంచె రాములు, ఉపాధ్యక్షులుగా రాము, గోపాల్, రాంజీ, శేఖర్‌రెడ్డి, కోశాధికారిగా గోపాల్, కార్యదర్శిగా హరిబాబు, గోపాల్‌ను ఎన్నుకున్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

షాద్‌నగర్ అర్బన్: అధికారంలోకి వస్తే వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం మాట మరిచి మాదిగలను అవమాన పరుస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. పార్లమెంటులో ఎస్సీవర్గీకరణకు చట్టబద్దత చేయాలంటూ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు రిలేనిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో బుర్ర రాంచద్రయ్య, పెంటనోళ్ల నర్సింహులు, శివకుమార్, శ్రీనివాస్, భాస్కర్, రాజు, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

'స్కూల్ గేమ్ ఫెడరేషన్'కు కొత్తూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

కొత్తూరు: 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' అండర్-14 క్రికెట్‌కు కొత్తూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కిరణ్, అభివాసు ఎంపికైనట్లు పాఠశాల పీ.డీ.విజయ్‌సాగర్ తెలిపారు.ఈనెల 2న హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని వీఎం హోమ్‌లో నిర్వహించే అండర్-14 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ జాగృతి నూతన కార్యవర్గం

కొత్తూరు: మండల పరిధిలోన ఇన్ముల్‌నర్వ తెలంగాణ జాగృతి గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి గడ్డం సత్యనారాయణ కొత్తూరు మండల కన్వీనర్ దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా శంకరచారి, మహిళా కన్వీనర్‌గా రమాదేవి, యువత కన్వీనర్‌గా రాజుయాదవ్‌ను ఎన్నుకున్నారు.

ఇక ఇంటింటికీ.. మున్సిపాలిటీ సేవలు



శరత్‌చంద్ర, మున్సిపల్ కమిషనర్

షాద్‌నగర్ టౌన్: ఇకపై ప్రజలు తమ సమస్యలను విన్నవించడానికి మున్సిపల్ కార్యాలయానికి స్వయంగా రాకుండా ఇంటింటికీ మున్సిపల్ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. వీధి లైట్లు వెలగకపోవడం, చెత్తకుండీల్లో చెత్త నిండిపోవడం, నీరు రాకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యాలపై ఫిర్యాదు చేసేందుకు మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. www.shadnagarmunicipality.com అనే వెబ్‌సైట్ ద్వారా సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. ఇంటి పన్ను, నీటి పన్నులు కూడా ఈ మొబైల్ యాప్ ద్వారా తమ క్రెడిట్, డెబిట్ కార్డులను వినియోగించి బిల్లులను చెల్లించవచ్చని తెలిపారు. పలు ధృవపత్రాల జారీ సమాచారాన్ని పొందవచ్చని వివరించారు. ఈ యాప్‌ను గూగుల్‌ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సదవకాశాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ కోరారు.

'విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి'



నోటు పుస్తకాలను అందజేస్తున్న ఎస్ఐ

నందిగామ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరాలని స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని చంద్రాయన్‌గూడ గ్రామ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దాత పరుశురాంరెడ్డి ఆర్థిక సహకారంతో నోటుపుస్తకాలు, బ్యాగులు, డ్రాయింగ్ సామాగ్రిని అందించారు. గతంలో కూడా పరుశురాంరెడ్డి పాఠశాలకు బెంచీలు, కుర్చీలు, ఫ్యాన్లు అందజేసిన విషయాన్ని తెలుసుకొని ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మోహన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, చెన్నారెడ్డి, పవన్ రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, యాదిరెడ్డి, రామకృష్ణ, రఘురాం, చరణ్, అజయ్ పాల్గొన్నారు.

జిల్లేడ్ - చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో ఉన్న కొందుర్గు కేజీబీవీ పాఠశాలను వయోజన విద్య రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డి.సుధాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలతో మాట్లాడారు. విద్యార్థులకు చక్కటి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాందాస్‌నాయక్, మండల విద్యా శాఖ అధికారి కిష్టారెడ్డి పాల్గొన్నారు. - కొందుర్గు



పల్లె ప్రగతికి హామీ..!



వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి గ్రామం వ్యూ

- పథకాలను సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి

వికారాబాద్ అర్బన్ : ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తే ఏ పని కాదు.. అందుబాటులో ఉన్న నిధుల్ని అమలులో ఉన్న పథకాల్ని సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులేస్తాయి. అనుకున్న మేరకు ప్రగతిని సాధించవచ్చు. పంచాయతీలకు మంజూరయ్యే అరకొర నిధులతో ఏ పనులు పూర్తిచేసుకోలేని పరిస్థితి ఉన్నందున సర్పంచులు నిరుత్సాహపడకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుంటే మేలు జరుగుతుంది. పల్లెలు ప్రగతి బాట పట్టడంతోపాటు కూలీలకు ఉపాధి చూపట్టినట్లు అవుతుంది. వికారాబాద్ మండలంలో 21గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ జాబ్‌కార్డులు కలిగిన కూలీలు 8485 మంది ఉన్నారు. 698 శ్రమశక్తి సంఘాలున్నాయి. ప్రస్తుతం రోజువారికి 5350మంది కూలీలు ఉపాధి పథకం పనుల్లో పాల్గొంటున్నారు. వీరి ద్వారా గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం, పర్యావరణం భూగర్భజలాల పెంపు, మౌలిక, సదుపాయాల్ని సమకూర్చుకోవచ్చు. అవసరాలకు తగినట్టు ప్రణాళికను రూపొందించుకుని ముందుకు సాగితే ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. గతంలో పోలిస్తే ఉపాధి హామీ పథకంలో కొన్ని మార్పులు చేశారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం తదితర వాటికి ప్రాధాన్యం కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి గల అవకాశాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

స్వచ్ఛ పల్లెలుగా మారుద్దాం..

పల్లెలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధి హామీ పథకంలో అవకాశం ఉంది. చెత్తాచెదారం ఒకచోట నిల్వ చేసేందుకు వీలుగా డంపింగ్ యార్డులను నిర్మించుకోవచ్చు. దీనికి ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వారితో పనులు చేయించుకోవాలి. పైగా గ్రామాల్లోని చెత్తను సేకరించేందుకు నెలకు 15రోజుల చొప్పున ఏడాదిలో 150రోజులు చెత్త రవాణాకు నెలకు నాలుగు పనిదినాల చొప్పున 48రోజులకు ఉపాధి హామీ పథకం కింద వేతనం చెల్లించడానికి వీలుంది. ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేయవచ్చు. దీంతోపాటు ఇళ్లల్లో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు రూ.12వేలు చెల్లిస్తున్నారు. గతంలో కాకుండా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన గుంతల్ని ఉపాధి హామీ పథకం కింద తవ్వించుకునే వీలుంది. దీనికి ముందుగా గ్రామాల్లో సర్వేచేసి అవసరమైనవారి వివరాలతో మండల అభివృద్ధి అధికారి నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.

మొక్కలు నాటుదాం..

ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటేందుకు అనేక అవకాశాలున్నాయి. హరితహారంలో భాగంగా గ్రామాన్ని పచ్చదనంతో నింపేయవచ్చు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాపాడడమేకాకుండా ప్రశాంత వాతావరణాన్ని పెంపొందించినవారవుతారు. రైతుల భూములతోపాటు పాఠశాలల్లో రోడ్డుకి ఇరువైపులా పంచాయతీ ఆవరణల్లో మొక్కలు నాటుకోవచ్చు. ఉద్యాన మొక్కలు చల్లని నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి. మండలాల్లోనే నర్సరీలు ఏర్పాటుచేసి ఉచితంగా మొక్కల సరఫరా చేస్తున్నారు. గుంతలు తవ్వేందుకు మొక్కలు నాటేందుకు వాటి పోషణకు కూడా ఉపాధి హామీ పథకం నుంచి డబ్బు చెల్లిస్తారు. కూలీలను గుర్తించి వారికి బాధ్యతను అప్పగించడంతోపాటు సకాలంలో డబ్బు అందేలా సర్పంచులు పర్యవేక్షిస్తే గ్రామాలు హరితమయమవుతాయి.

సేంద్రియ ఎరువు..

రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా ఉపాధి పథకం కింద కంపోస్టు యూనిట్ల ఏర్పాటుకు వీలుగా తవ్వకాలు చేసుకోవచ్చు. ఇందుకు ప్రత్యేకంగా పథకం కింద నిధులున్నాయి. ఆసక్తి గల రైతులను గుర్తించి పొలాల్లో కంపోస్టు గుంతలను ఏర్పాటుచేస్తే సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేసుకోవచ్చు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఉపాధి పథకం కింద నిధులు కేటాయించే అవకాశం ఉన్న నేపథ్యంలో విరివిగా తవ్వించి సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా రైతుల్ని ప్రోత్సహించవచ్చు. కూరగాయల్ని సాగు చేసేవారు వీటిని ఏర్పాటు చేసుకుంటే నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చు.

పూడికతీత..

గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, ఊట కుంటలు కాల్వల్లో పూడిక తీసుకునే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించి కూలీలతో పనులు చేయిస్తే అటు వారికి ఉపాధి చూడపంతో పాటు నీటి వనరులు బాగవుతాయి. సాగు భూములకు నీరందించడంతోపాటు నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. మిషన్ కాయతీయలో లేని చెరువులు ఇతర చిన్ననీటి వనరుల్ని ఉపాధి హామీ పథకం కింద బాగుచేసుకోవడానికి ఇది సరైన సమయం. నీటి వనరులు ఉన్న గ్రామాల సర్పంచులు వీటిపై దృష్టి సారించి పూర్తిచేయించాలి. రూ.లక్షల వ్యయంతో అయ్యే పనులు కూలీలతో చేయిస్తే వారికి పని కల్పించినట్లవుతుంది.

దారి చూపండి..

గ్రామం నుంచి ఇతర గ్రామాలు, పంట పొలాలు ఇలా దారులు లేని ప్రాంతాలకు ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేసుకునే అవకాశం ఉంది. గ్రామాల వారీగా ప్రాధాన్యమున్న రోడ్లను గుర్తించి వివరాలతో ప్రణాళిక రూపొందించిన ఎంపీడీవో అనుమతి తీసుకోవాలి. గుర్తించిన దారికి ఇరువైపులా మట్టిని తవ్వి రోడ్లు వేసుకోవాలి. ఇలా ఎడ్ల బండ్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది. తర్వాత ఇతర నిధులతో మొరం ఆ తర్వాత బీటీ రహదారులుగా మార్చుకోవచ్చు. ఇందుకుగాను రైతులు ఇబ్బందిపడుతున్న మార్గాలను గుర్తించి వాటిని ఉపాధి హామీ పథకం కింద పూర్తి చేసుకుంటే గ్రామస్థులకు దారి చూపిన వారవుతారు. ఇందులో కొంత కూలీల తోపాటు యంత్రాలకు సంబంధించిన పని ఉండడం వల్ల వాటిని కొంత శాతం మేరకు ఉపయోగించుకునే వీలుంది.

ఇంకుడు గుంతలు..

ఉపాధి హామీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు నిర్మించుకోవచ్చు. గ్రామంలోని జాబ్‌కార్డు ఉన్న వారు ఎవరైనా తమ ఇంటి వద్ద ఇంకుడుగుంత నిర్మించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒక గుంతకు రూ.4095 చెల్లిస్తుంది. వీటిని నిర్మించుకోవడం ద్వారా వృథా నీటిని భూమిలో ఇంకించి ఎద్దడిని నివారించవచ్చు. దీని ద్వారా కూలీలకు పనితోపాటు భూగర్భంలో నీటి మట్టం పెంచుకోవచ్చు.

నీటి నిల్వ..

వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ భూముల్లో కాంటూరు కందకాలు, మినీ ఊట కుంటలు, నీటి నిల్వ కందకాలు ఫాంపండ్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. గ్రామ సమీపంలో నీటిని ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుంది. ఎక్కడెక్కడ ఎవరి భూముల్లో నిర్మించాలనేది ముందుగా గుర్తించి ప్రతిపాదనలు రూపొందించుకుంటే పకడ్బందీగా పనులు పూర్తిచేసుకోవడానికి వీలుంది. 75 మీటర్ల పొడవు అవసరమైన మేరకు లోతు నిర్మించుకోవచ్చు. గ్రామంలో ఎన్ని ఎక్కువ నిర్మించుకుంటే అంత నీరు భూమిలో ఇంకుతుంది.

ప్రైవేట్ విద్య కలేనా.?



- విద్యాహక్కు చట్టం కింద ఊసేలేని 25 శాతం సీట్ల కేటాయింపు
- పేదలకు ప్రైవేట్ విద్య అందని ద్రాక్షేనా.?
- యథేచ్ఛగా ఫీజుల వసూళ్లు
- పట్టించుకోని అధికారులు

పరిగి: విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉంది. అయితే ఈ చట్టం వచ్చి ఏడేళ్లు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు. ప్రత్యేకించి ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కల్పించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఈ చట్టం అమలు జరిగితే ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో పేదల పిల్లలకు చదువు కల నేరవేరనుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పందించి అమలు చేయాలని పేద పిల్లల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన రోజు కూడా పేదలకూ ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పిన సంగతి విధితమే. గత ఏడాది దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్పటీ కేంద్ర ప్రభుత్వంపై మెట్టికాయలు వేసిన ఫలితం లేకుండా పోయింది. అయినా అమలులో అందనంతా దూరంగా ఉంది. విద్యాహక్కు చట్టాన్ని ఖచ్చితంగా బాధ్యాతాయుతంగా నిర్వహించాల్సిన అధికార యంత్రాంగం వైఫల్యం వల్లనే ఈ చట్టం అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. న్యాయస్థానం ఆదేశించడం వల్ల విద్యా సంవత్సరం అమలు జరుగుతుందని ఆశించారు కానీ, ఆశలు నిరాశాలుగానే మిగులుతున్నాయి. 2017-18 విద్యాసంవత్సరం ప్రారంభమైంది. అయితే అంతకు ముందుగానే జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలన్ని తమ సీట్లన్నింటిని ప్రైవేట్ ఫీజులతో భర్తీ చేసుకుంటున్నాయి. కొన్ని విద్యా సంస్థలు నిబంధనలకు మించి కూడా ఎక్కువగా చేసుకుంటున్నాయి. అయితే ఎక్కడా కూడా ఉచితంగా పేదలకు సీట్లు ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే దీనిపై ఏడాది కాలం ప్రభుత్వం నాన్చుడిదోరణిని అవలంభించడం కూడా ఒక కారణమని విద్యారంగా విశ్లేషకులు బావిస్తున్నారు. ఫలితంగా పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యను అందని ద్రాక్షలా మారిపోతుందని చెప్పవచ్చు.

అమలైతే వేలాది మందికి లబ్ధి

న్యాయస్థానం తీర్పును అనుసరించి కేంద్రప్రభుత్వం తక్షణమే దీనిపై మార్గదర్శకాలు జారీచేస్తే జిల్లాలో వేలాది మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో వందకుపైగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఉంటాయి. వీటి పరిధిలో దాదాపుగా 40వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుంటారు. అయితే వీటి వల్ల 25 శాతం సీట్లు పేద పేద విద్యార్థులకోసం కేటాయిస్తే దాదాపుగా పదివేల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. ఇందులో కూడా రిజర్వేషన్ల వారిగా ఎంపిక చేయాలని సూచించింది. విద్యాహక్కు చట్టం నిర్దేశించిన విధంగా అనాథలు, ఎయిడ్స్ బాధితులకు ఐదు శాతం. ఎస్సీలకు 10 శాతం, గిరిజనులకు నాలుగుశాతం, బీసీలకు ఆరుశాతం సీట్లను కేటాయించింది. ఈ విద్యార్థుల ఎంపిక విద్యాశాఖ అధికారులు, పాఠశాల యజమాన్యాల నిర్వహణ కమిటీ సమక్షంలో ఎంపిక చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ఎంపిక గురించి గతంలో సుప్రీం కోర్టు కూడా సూచించింది. దీనికితోడు ఈ పిల్లలను ఇతర విద్యార్థులతో సమానంగా కూర్చోబెట్టడంతోపాటు, అన్ని రకాల వసతులన్ని సరి సమానంగా అందించాల్సి ఉంటుంది. అయితే కేవలం వ్యాపార దృక్పథంతో పని చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు దీన్ని అసలు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ పాటశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రతి ఏడాది ప్రత్యేక టాస్క్‌పోర్సు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నది. ఈ కమిటీ సిపార్సుగానే మిగిలిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యహక్కు చట్టాన్ని అమలు చేయాలి



ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం పేద విద్యార్థులు ఉచిత విద్యను అందించాలని నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను ఫీజుల పేరిటి దోపిడీకి గురి చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తే జిల్లాలో 10 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా కలెక్టర్, డీఈవో ఈ విషయంపై చొరవ తీసుకుని ఖచ్చితంగా చేస్తే పేదల విద్యార్థులకు లాభం జరుగుతుంది.

-లాల్‌కృష్ణప్రసాద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు


మొహం చాటేసిన వరుణుడు



బొంపల్లితండాలో ఎండుతున్న మొక్కజొన్న

నీరుచేరని జలాశయాలు
ఎండుతున్న పంటలు
ఆందోళనలో అన్నదాతలు

పరిగి: ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సాధారణానికి మించిన వర్షపాతం నమోదైనప్పటికీ రైతుల్లో కలవరం మొదలైంది. వాతావరణంలో మార్పులు, చిన్నపాటి వర్షం కురుస్తున్నప్పటికీ పంటలకు సరిపోవడం లేదు. నల్లరేగడి భూముల్లో పంటలు కాస్త బాగున్నప్పటికీ చెలక భూముల్లో మొక్కజొన్న తదితర పంటలు ఎండుముఖం పడుతున్నాయి. జూన్‌లో కుసిరిసిన వర్షాలు, జూలైలో కానరాకుండా పోయాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి మేఘాలు కుమ్ముకుని ఊరిస్తూ చిన్నపాటి వర్షాలే తప్పా, వాగులు పారే వర్షాలు కురియలేదు. జిల్లాలో అక్కడక్కడ వానలు కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో మాత్రం చినుకు జాడ లేకుండా పోయింది. అన్నదాతల ఆశల్లో వరుణుడు నిప్పులు చల్లుతున్నాడు. మొదట్లో కురిసిన వానలకు నల్లరేగడి, చెలక నేలల్లో రైతులు విత్తుకున్నారు. కలుపు తీత పనులు కూడా అయిపోయాయి. పంటలన్నీ ఏపుగా కనిపిస్తున్నాయి. వర్షం లేక నేలకొరుగుతున్నాయి. పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న, పత్తి సాగు సాధారణం కంటే ఎక్కువగానే చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పూడూరు, పరిగి మండలాల్లో కొన్ని రోజుల వరకు తట్టుకుంటాయి కానీ, దోమ, కులకచర్ల మండలాల్లో మొక్కజొన్న, జొన్న, పత్తి పంటలు ఎండిపోతున్నాయి. దోమ మండలం బాసుపల్లి, బొంపల్లి, గోడుగోనిపల్లి, మోత్కూర్, మైలారం, కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్, కామునిపల్లి, అంతారం, పుట్టపహాడ్, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. మరో వారం రోజులు వానలు కురియకపోతే ప్రధానంగా మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. వానదేవుడు కురుణిస్తాడేమోనని అన్నదాతలు ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు.



చుక్కనీరు లేని పుట్టపహాడ్ చెరువు

ఊరిస్తున్న మేఘాలు.. జాడలేని చినుకులు

ఊరిస్తున్న మేఘాలు, ముదురుతున్న ఎండలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సన్నపాటి వర్షాలు కాపాడుతూ వస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకు ఏ ఒక్క చెరువు కుంటల్లోకి నీరు చేరిన దాఖలాలు లేవు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సీజన్ జూన్ మాసంలో కురిసిన వర్షాలకు ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు. తీరా జూలై నుంచి ఇప్పటి వరకు పరిస్థితి తలకిందులైంది.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

పరిగి సబ్ డివిజన్‌లోని పరిగి, దోమ, కులకచర్ల మండలాల్లో 200లకుపైగా చెరువు, కుంటలు ఉన్నాయి. గత సంవత్సరం కూడా వర్షాలు ఆశించిన స్థాయిలో కురువక చెరువు, కుంటలు నిండలేదు వాటి కింద పంటల సాగుకు నోచుకోలేదు. చెరువుల కింద ఈ సారి కూడా పంట సాగుబాటుకు నోచుకునే పరిస్థితి లేదు. వర్షాలు కురవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. సబ్ డివిజన్‌లోని ప్రధానంగా లక్నాపూర్, అంతారం పాటిమీద చెరువు, రాయన్‌చెరువు, ఇబ్రహీంపూర్, దోమ పెద్దచెరువు, ఐనాపూర్, కిష్టాపూర్, ముజాహిద్, కులకచర్ల తదితర చెరువుల్లో ఇంకా నీరు చేరలేదు. అయితే ఆయా గ్రామాల్లోని రైతులు వరుణుడి కోసం పూజలు చేస్తున్నారు.



వర్షం కోసం భజన చేస్తున్న మహిళలు

వర్షాల కోసం పూజలు..

కొడంగల్: వర్షాలు కురవాలి వరుణ దేవుడా...పంటలు సమృద్ధిగా పండాలి వరుణుడా అంటూ భజనలతో వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని వడ్డర్‌గల్లీ చితారుపెరుమాళ్ల ఆంజనేయస్వామి భజన మండలి తదితర కాలనీలకు చెందిన ప్రజలు వర్షాల కోసం కొడంగల్ నుంచి సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయం వరకు భజనతో వరుణ దేవుడిని స్మరిస్తూ తరలి వెళ్లారు. ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరుణ దేవుడిని ప్రార్థించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలతో పాటు భజనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలు వర్షాలు లేక ఎండుముఖం పట్టడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 20 రోజులకుపైగా వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు నష్టానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు వివిధ గ్రామాల్లో వరుణ దేవుడి కరుణ కోసం భజనలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

మొక్కజొన్న ఎండిపోతున్నది

మంత్రి మహిపాల్, రైతు, బాసుపల్లి



మొదట్లో వర్షాలు మురిపించాయి. ఆశతో పంటల సాగుకు వేలాది రూపాయల అప్పులు చేసి మొక్కజొన్న సాగు చేశా. పంట ఏపుగా వచ్చి మురిపిస్తున్నది. వర్షాకాలం ఉసూరు మనడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. రెండు, మూడు రోజుల్లో వర్షం కురిస్తే పంట ఉంటుంది. ఆలస్యం అయితే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే.

నేటినుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

జోనల్ స్థాయి ఆటల నిర్వహణకు రంగం సిద్ధం

వారాంతం వరకు సాగనున్న పోటీలు

వికారాబాద్ ఫీచర్స్ : జిల్లాలో నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల సందడి మొదలు కానుంది. బుధవారం నుంచి వారం రోజుల పాటు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడా విభాగాల్లో ఆయా మండలాల నుంచి వచ్చే జట్లకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ క్రీడల నిర్వహణకు సౌలభ్యంగా ఉండేందుకు క్రీడాశాఖ అధికారులు జిల్లాలోని 18 మండలాలను వికారాబాద్, పరిగి, ధారూరు, కొడంగల్, తాండూరు, మోమిన్‌పేట్ జోన్లుగా విభజించారు. మొత్తం 6 జోన్లు ఉండగా ఒక్కో జోన్ పరిధిలో మూడేసి మండలాలున్నాయి. పోటీలు ముగిశాక సంబంధిత మండలాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సంబంధిత క్రీడల్లో జోన్ జట్లకు ఎంపిక చేస్తారు.

క్రీడల నిర్వహణలో కొత్త విధానం

జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడిగా ఉన్న రంగారెడ్డి జిల్లాలో ప్రతీ నియోజకవర్గాన్ని ఓ జోన్‌గా భావించే వారు. అప్పట్లో ముందుగా జోన్‌ల వారీగా క్రీడలను నిర్వహించి తర్వాత నేరుగా రంగారెడ్డి జిల్లా స్థాయిలో క్రీడలను నిర్వహించే వారు. అనంతరం 10 జిల్లాల జట్లతో రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ జరిగేది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లాలు ఉండడంతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాలో గల 6 జోన్లలో ముందుగా క్రీడలను నిర్వహిస్తారు. అనంతరం జోన్లవారీగా ఆయా క్రీడల్లో ఎంపికైన జట్లనన్నింటినీ కలిపి వికారాబాద్ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తారు. ఇందులో క్రీడాకారులు కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఆయా విభాగాల్లో వికారాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేస్తారు. ఇదే తరహాలో ఎంపిక చేసిన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల జట్లతో వికారాబాద్ జిల్లా జట్లను కలిపి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి క్రీడలను నిర్వహిస్తారు. ఆ పోటీల్లో ప్రతిభ ఆధారంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు. అన్ని రకాల క్రీడలకూ ఇదే పద్ధతి పాటిస్తారు.

రెండో వారంలో వికారాబాద్ జిల్లా స్థాయి క్రీడలు

ఆగస్టు మొదటి వారంలో జోనల్ స్థాయి క్రీడలు ముగిశాక రెండు లేదా 3వ వారంలో వికారాబాద్ జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పోటీలు ముగిశాక ఆగస్టు చివరికల్లా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నారు. అయితే పరిస్థితులను బట్టి షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కెరోటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. **రైతు : నాగలి :: సైనికుడు: ---------**
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. **పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---**
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. **బలం: వాట్ :: విద్యుత్ : --------**
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. **ముఖేష్: హాకీ :: చెస్ : -------**
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. **కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్**
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. **హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----**
ఎ) చెన్నై బి) పనాజీ సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. **భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------**
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరతనాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. **న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------**
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. **చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------**
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. **ఇండియా : రూపాయి :: జపాన్ : -------**
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. **గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------**
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. **ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------**
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. **స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------**
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. **మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------**
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. **పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------**
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. **కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------**
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. **హాంకాంగ్: చైనా:: వాటికన్: --------**
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. **ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------**
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. **వినడం: చెముడు:: మాట్లాడడం: --------**
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. **భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------**
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. **హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------**
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. **తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----**
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. **సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------**
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. **రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----**
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. **ఓనం: కేరళ:: బిహు: ------**
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అస్సోం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అస్సోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. **ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------**
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. **శిల్పం: రూపం:: పాట ------**
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్‌ఏ) సంస్థల్లో పీహెచ్‌డీ చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్‌ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్‌ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

